సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023




నిప్పుతో జాగ్రత్త..!
చిన్నచిన్న తప్పిదాలతోనే నిత్యం ఏదో ఓ చోట అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నాయి. 8లో▸



వీవోఏల నిరవధిక సమ్మె
తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు సమ్మె బాట పట్టారు. ఆయా మండలకేంద్రాల్లోని కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. 9లో▸


గరిష్టం/కనిష్టం
42.0/27.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వడ గాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

మరో ఇద్దరికి కోవిడ్



ఆదిలాబాద్ టౌన్: జిల్లాలో మంగళవారం మరో ఇద్దరు కోవిడ్ బారిన పడ్డారు. జిల్లా వ్యాప్తంగా 48 మందికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ అయింది. ఇందులో స్థానిక రాంనగర్‌కు చెందిన 28 ఏళ్ల మహిళ, శాంతినగర్‌కు చెందిన ఏడాది బాలిక ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో తొమ్మిది యాక్టివ్ కేసులు ఉండగా ఇందులో రిమ్స్‌లో ఏడుగురు , హోం ఐసోలేషన్‌లో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

కొనసాగుతున్న పికెట్



పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

నేరడిగొండ: అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు. మంగళవారం సైతం కొనసాగింది.

21న కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



మాట్లాడుతున్న సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ముస్లిం సోదరులందరికీ ఈ నెల 21న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్‌లోని సెంట్రల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీపీసీసీ ఎల్‌డీఎమ్మార్సీ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. ముస్లింలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నగేష్, సంతోష్, ఖలీంభాయ్, అఫ్రోజ్, శివాజీ, నాహిద్, రాహుల్ ఉన్నారు.

నిరసన దీక్షలో జిల్లా నాయకులు



నిరసన దీక్షలో పాల్గొన్న జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మంగళవారం నిర్వహించిన నిరుద్యోగుల గోస–అఖిలపక్ష పార్టీల భరోసా దీక్షలో జిల్లాకు చెందిన బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి రమేశ్, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి జంగు బాపు, లక్ష్మణ్, పోశెట్టి, మీనా,సృజన్, అరవింద్, తదితరులు ఉన్నారు.

బజార్‌హత్నూర్‌లో రాళ్లవాన

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్, దేగామ, మంజరంతండా, టెంబి, ధరంపురి, జాతర్ల, బోస్రా, ఏసాపూర్ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం రాళ్ల వాన కురిసింది. రైతులు రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న, రబీ జొన్నలు తడిసిపోయాయి. నువ్వు, దనియా పంటలు నేలవాలాయి.

సిరికొండ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఇదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రోజంతా వేడితో ఉక్కిరిబిక్కిరి అయిన జనం వర్షం కారణంగా వాతవరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.



లైసెన్స్ ఇంజినీర్లతో సమావేశమైన ఏసీపీవో

క్రమబద్ధీకరణకు వేళాయె

- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన
- మున్సిపల్ యంత్రాంగం కసరత్తు
- రూ.కోట్లలో ఆదాయం సమకూరే అవకాశం
- ఇబ్బందిగా మారనున్న సిబ్బంది కొరత

పట్టణంలోని ఎల్ఆర్ఎస్ బ్లాక్‌లు	8
ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు	19,210



ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ నమూనా

కైలాస్‌నగర్: అనధికార లేఅవుట్లలోని ప్లాట్లతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్ల క్రమబద్ధీకరణకు మున్సిపల్ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఎల్ఆర్ఎస్ కోసం ప్రభుత్వం రెండేళ్ల క్రితమే దరఖాస్తులు స్వీకరించింది. అయితే దీనిపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో పెండింగ్‌లో ఉంచింది. తాజాగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చేపట్టాలంటూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆదేశించారు. దీంతో మున్సిపల్ యంత్రాంగం దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియ పూర్తిచేసినట్లేతే మున్సిపల్ ఖజానా కాసులతో నిండనుంది.

రెండేళ్ల తర్వాత పరిశీలన

అనుమతి లేని లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్లను రెగ్యులరైజ్ చేసేలా ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ప్రవేశపెట్టింది. ఇందు కోసం 2020 ఆగస్టు 26 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని ఆదిలాబాద్, ఖానాపూర్, అనుకుంట (కొంత భాగం), భుక్తాపూర్, రాంపూర్ (కొంత భాగం), మావల, బట్టిసావర్గాం, కచికంటి వంటి ఎనిమిది బ్లాక్‌ల నుంచి 19,205 దరఖాస్తులు అందాయి. వాటిని అప్పట్లోనే రెగ్యులరైజేషన్ చేయాల్సి ఉండగా రాష్ట్రస్థాయిలో కొంత మంది హైకోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. రెండేళ్ల తర్వాత మళ్లీ దరఖాస్తుల పరిశీలన చేపట్టడంతో దరఖాస్తుదారుల్లో హర్షం వ్యక్తమవుతుంది. ఎందుకంటే ఎల్ఆర్ఎస్ కింద ఇచ్చే ప్రొసీడింగ్‌తో నూతన నిర్మాణాలకు అనుమతుల పాటు ఇతర ఇక్కట్లు తొలిగిపోతాయ. అలాగే దరఖాస్తుదారుకు చట్టపరంగా హక్కు లభించనుంది.

కసరత్తు షురూ

తమకు అందిన దరఖాస్తుల వివరాలను ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపించి, వాటి రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న మార్కెట్ విలువకు సంబంధించిన వివరాలు తెప్పించుకున్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇటీవల మున్సిపల్ పరిధిలోని లైసెన్స్ ఇంజినీర్లతో సమావేశమయ్యారు. తమ ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలు అందించాలని కోరారు. ప్రణాళిక విభాగంలో పనిచేసే నలుగురు చైన్‌మెన్‌లతో దరఖాస్తుదారుల సెల్ నంబర్లకు ఫోన్ చేసి వారి దరఖాస్తుకు సంబంధించిన ప్లాట్ల వివరాలు సేకరిస్తున్నారు. అయితే కొంతమంది తాము ఇళ్లు కట్టుకున్నామని, ఎల్ఆర్ఎస్ ఇప్పుడు అవసరం లేదని చెబుతుండగా,ఇంకొంత మంది సెల్‌నంబర్లు పనిచేయకపోవడం వారికి కొంత ఇబ్బందిగా మారుతోంది.

ఖజానాకు కాసుల పంట

నిధుల కొరతతో సతమతమవుతున్న ఆదిలాబాద్ బల్దియాకు ఈ ఎల్ఆర్ఎస్ కలిసొచ్చేదిగా చెప్పవచ్చు. ఈ ప్రక్రియ నిర్వహణతో బల్దియాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశముంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించిన ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న మార్కెట్ విలువలో 14శాతం డబ్బులు వసూలు చేయనున్నందున బల్దియాకు రూ. కోట్లలో ఆదాయం సమకూరే అవకాశముంది.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

ప్రతీ దరఖాస్తును టీపీఎస్, టీపీవో, ఏసీపీ పరిశీలించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు సంబంధించిన ప్లాట్లు బఫర్‌జోన్, చెరువులు, కుంటలు, రైల్వేలైన్, గ్రీన్‌బెల్టు పరిధిలో ఉన్నాయా అనేదాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఉన్న ప్లాట్ల వివరాలను కమిషనర్ ఆమోదం కోసం పంపించాల్సి ఉంటుంది. అలాగే ప్లాట్ల కొలతలు, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సమయంలో మార్కెట్ ధరలు వంటి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటంది. ఈ లెక్కన ఒక్కో దరఖాస్తుకు గంటకు పైగా సమయం పట్టే అవకాశముంటుంది. గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్, టీపీఎస్, టీపీవో ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. వీరు దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిశీలించడం కష్టతరంగా మారనుంది. 19వేల దరఖాస్తులను పరిశీలించి వివరాలు నమోదు చేయాలంటే ఏడాది గడిచినా పూర్తయ్యేలా కనిపించడం లేదు.

దరఖాస్తులను పరిశీలిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనను ప్రారంభించాం. దరఖాస్తుదారుల సెల్‌నంబర్లకు ఫోన్ చేసి వారిచ్చిన సమాచారం ఆధారంగా విచారణ చేస్తున్నాం. సిబ్బంది కొరత కొంత ఇబ్బందిగా ఉన్న మాట వాస్తవమే. దీని కోసం తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆ దిశగా ప్రయత్నిస్తున్నాం. దరఖాస్తుదారులు సకాలంలో సరైన సమాచారమందిస్తే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుంది. వారికి ప్రయోజనం చేకూరుతోంది.

– అనురాధ, టౌన్ ప్లానింగ్ అధికారి

రేవంత్ వర్గం దూకుడు



- 'ఏలేటి' అనుచరగణంపైనే ఫోకస్
- తమవైపు మలుచుకుంటూ..పట్టు పెంచుకుంటూ..
- ప్రేమ్‌సాగర్‌రావ్ వర్గ ఆధిపత్యానికి చెక్ పెట్టేలా వ్యూహం
- ఈనెల 26న జిల్లాలో రేవంత్ పర్యటన
- ఆసక్తికరంగా 'హస్తం' రాజకీయాలు

సాక్షి,ఆదిలాబాద్: ఏలేటి కాంగ్రెస్ పార్టీని వీడిన తర్వాత ఆ వర్గాన్ని తమవైపు తిప్పుకునేలా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దూకుడు పెంచారు. తద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావ్ వర్గ ఆధిపత్యానికి చెక్ పెట్టేలా వ్యూహం రచిస్తూ ముందుకు కదులుతున్నారు. రాష్ట్రంలో సీనియర్ కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రేమ్‌సాగర్ రావ్ టీపీసీసీ అధ్యక్షుడిని వ్యతిరేకిస్తుండటం, మరోపక్క మొన్నటివరకు వ్యతిరేక వర్గంగా కొనసాగిన మహేశ్వర్ రెడ్డి పార్టీని వీడి వెళ్లిన తర్వాత జిల్లాలో ఆ ఖాళీని భర్తీ చేసేవిధంగా రాష్ట్ర అధ్యక్షుడి అనుచర వర్గం స్పీడ్ పెంచింది.

ఇక జిల్లాపై దృష్టి..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై దృష్టి సారించారు. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలపై ఆయన ఫోకస్ ఉండే అవకాశాలు ఉన్నాయి. పార్టీలో అందరు కలిసి నడవాలని పైకి చెప్పినప్పటికీ ప్రధానంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రేమ్‌సాగర్ రావ్ రాజకీయాలకు చెక్ పెట్టేలా అధినేత వ్యూహాలు సాగుతున్నాయనే ప్రచారం నడుస్తోంది. ఇందులో భాగంగానే ఈనెల 26న ఆయన ఆదిలాబాద్ పర్యటన ఖరారైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాహుల్ గాంధీపై బీజేపీ సర్కార్ అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట జిల్లాకేంద్రంలో కార్యకర్తలతో భారీ ర్యాలీ, సభ నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక్కడినుంచే ఆయన ఈ జిల్లాపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు మొదలవుతాయనేది పార్టీలో ప్రస్తుతం జరుగుతున్న చర్చ.

అనుచరగణం స్పీడ్..

జిల్లాపై పట్టు పెంచుకునే వ్యూహంలో భాగంగా రేవంత్ రెడ్డి అనుచరులు రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, రాష్ట్ర నాయకులు బెల్యానాయక్, సత్తు మల్లేశ్ ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. బోథ్‌లో సత్యాగ్రహ సభ నిర్వహించి ప్రధానంగా మహేశ్వర్ రెడ్డి వర్గం నాయకులను పార్టీ నుంచి జారకుండా తమవైపు తిప్పుకోవడంలో ఈ వర్గం సక్సెస్ అయ్యింది. ఇక సత్తు మల్లేశ్ బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పటిష్టత కోసం విస్తృతంగా ప్రయత్నాలు చేపట్టారు. మరోపక్క ఇటీవల ఆయన మాజీ మంత్రి సి.రాంచంద్రా రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి పార్టీ పటిష్టత కోసం చేపట్టే చర్యల విషయమై చర్చించారు. అదేవిధంగా మంగళవారం సీఆర్ఆర్, నరేష్ జాదవ్‌లు హైదరాబాద్‌లో రేవంత్ రెడ్డిని కలిసి పార్టీ పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాలో పర్యటించేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. దీంతోనే ఇక జిల్లాలో పార్టీ పటిష్టత కోసం ఆయన ఫోకస్ పెట్టారని ప్రచారం జరుగుతుంది.

మొక్కుబడిగా పుర ప్రజావాణి

- అందుబాటులో ఉండని అధికారులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న అర్జీదారులు



సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలనే సదుద్దేశంతో చేపట్టిన పురప్రజావాణి కార్యక్రమం మొక్కుబడిగా మారుతోంది. కార్యక్రమాన్ని ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే రామన్న ప్రతీ మంగళవారం మున్సిపల్ అధికారులంతా అందుబాటులో ఉంటారని ప్రకటించారు. ఒకటి, రెండు వారాలు అధికారులున్నప్పటికీ ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా మారింది. పలు విభాగాల అధికారులు ఈ కార్యక్రమంతో తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తూ గైర్హాజరవుతున్నారు. కమిషనర్ అర్జీలు స్వీకరించి వాటిపై సంబంధిత విభాగాధికారులతో మాట్లాడుదామంటే వారు అందుబాటులో ఉండటం లేదు. దీంతో అర్జీదారులకు భరోసా కరువవుతుందనే భావన వ్యక్తమవుతోంది. గ్రీవెన్స్‌కే డుమ్మా కొట్టే అధికారులు ఇక ప్రజల సమస్యలను ఏ విధంగా పరిష్కరించి, వారికి భరోసా కల్పిస్తారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పుర ప్రజావాణిలో కమిషనర్ శైలజ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మున్సిపల్ మేనేజర్ దివాకర్, టీపీఓ అనురాధ మినహాయిస్తే మిగతా విభాగాల అధికారులేవరూ హాజరుకాకపోవడం గమనార్హం. కాగా ఈ వారం 25 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి 17 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ సెక్షన్‌కు 4, టౌన్ ప్లానింగ్‌కు 3, శానిటేషన్‌కు సంబంధించి ఒక అర్జీ అందాయి. వాటిని వారం రోజుల్లోగా పరిష్కరించనున్నట్లుగా కమిషనర్ వెల్లడించారు.

రూ. 40కోట్లతో తరోడ బ్రిడ్జి పనులు

జైనథ్: జాతీయ రహదారిపై తరోడ వద్ద త్వరలోనే రూ.40కోట్లతో కొత్త బ్రిడ్జి పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. మండలంలోని గిమ్మ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భోరజ్–బేల ఆర్అండ్‌బీ రోడ్డు రెండేళ్ల క్రితమే జాతీయ రహదారిగా మార్పు చెందిందన్నారు. ప్రస్తుతం తరోడ బ్రిడ్జి పనులు కేంద్రం పరిధిలో ఉన్నా బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే నెలలో బ్రిడ్జి టెండర్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గోవర్ధన్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నాయకులు లింగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భోజన్న, పరమేశ్వర్, వివిద గ్రామాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

'అల్లర్లు రాజకీయ కుట్రే'

ఎదులాపురం: అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నీరుగార్చేందుకే రాజకీయ కుట్రపూరితంగా అల్లర్లు సృష్టించారని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ రాజకీయ చదరంగంలో యువత తన భవితను నాశనం చేసుకోవద్దన్నారు. స్థానికంగా బీజేపీ ఎంపీని గెలిపించినా ఆయన జిల్లా అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాఘవులు, పూసం సచిన్, కిరణ్, సీనియర్ నాయకులు దత్తాత్రి, ఆశన్న, ఎం.గంగన్న, ఆర్.సురేందర్, ఆర్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై కాదు.. అడిగిన వారిపైనే కేసులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్

ఆదిలాబాద్: అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో వివాదానికి కారణమైన బాధ్యులను శిక్షించకుండా ఇదేమని అడిగిన వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. జయంతి ఉత్సవాల్లో జరిగిన దాడిలో బాధ్యులను శిక్షించాలని ఆదిలాబాద్ పట్టణ బంద్ చేపడితే వందల మంది పోలీసులతో ఎక్కడికక్కడ తమను అరెస్టు చేసి జైళ్లకు తరలించారని మండిపడ్డారు. మరోవైపు ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తే మాత్రం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను ఓ లాగా.. ప్రతిపక్షాలను మరోలాగా చూస్తున్న పోలీసులు తీరు సరికాదన్నారు. నిందితులను శిక్షించాలని విజ్ఞప్తి చేస్తే కొంత మంది పోలీస్ అధికారులు తమపైనే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు రవి, దినేష్ మటోలియా, వేణుగోపాల్, ప్రవీణ్ రెడ్డి, లాలామున్నా, ప్రవీణ్, రాష్ట్ర పాల్, రవి, సుభాష్, రాందాస్, రాకేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్

రైతుల సంక్షేమం కోసమే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

తలమడుగు: నకిలీ విత్తనాలు, ఎరువులతో నష్టపోతున్న రైతుల కోసం న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత అన్నారు. మండలంలోని సుంకిడి రైతు వేదికలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలతో పంటలు మొలకెత్తకపోతే న్యాయ సంస్థను సంప్రదించవన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సతీశ్ కుమార్, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, అదనపు ఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ వనజారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, సర్పంచ్ మహేందర్, మండల వ్యవసాయ అధికారి మహేందర్, ఎంపీటీసీ వెంకన్న, న్యాయమూర్తులు, న్యాయవాదులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

ఇళ్ల స్థలాల కోసం సంతకాల సేకరణ

కైలాస్‌నగర్: జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేశ్, షేక్ మోయిస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం స్పందించకుంటే సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

డీపీఆర్వోను సన్మానించిన జర్నలిస్టులు

డీపీఆర్వోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్‌ను టీడబ్ల్యూజేఎఫ్ సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సురేశ్, షేక్ మోయిస్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మీడియా కెమెరామెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనూ డీపీఆర్వోను పూలమాల, శాలువాతో సత్కరించారు. సభ్యులు పాల్గొన్నారు.

అన్నివర్గాల పండుగలకు ప్రభుత్వం పెద్దపీట

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: పేద ముస్లింలు కూడా రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం వారికి తోఫాలను పంపిణీ చేస్తుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలో ని మసీద్‌లో పేద ముస్లింలకు రంజాన్ కానుక (తోఫా)లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల పండుగలకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఎంపీపీ మోతుబాయి, సర్పంచ్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్‌ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



కానుకలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్

క్లుప్తంగా

ఆలయ పనులు పరిశీలన



మార్కింగ్ ఇస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులను మంగళవారం దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈఈ కనక దుర్గాప్రసాద్, డీఈఈ ప్రభాకర్, ఏఈ రామారావు పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి కొన్ని పనులకు మార్కింగ్ చేశారు. పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ జగన్మోహన్‌కు సూచించారు. అనంతరం బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అధికారులు ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, దేవాలయ అర్చకులు శ్రీనివాస శర్మ ఉన్నారు.

ట్రిపుల్‌ఐటీలో కరోనా పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు కరోనా పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు సిబ్బందికి కరోనా సోకడంతో అప్రమత్తం అయ్యారు. మంగళవారం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో 200 మంది విద్యార్థులకు కరోనా పరీక్షలు చేశారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఎవరికీ కరోనా సోకినట్లు నిర్ధారణ కాలేదు.

విద్యుత్‌షాక్‌తో పశువులు మృతి



మృతిచెందిన పశువులు

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో మంగళవారం విద్యుత్ షాక్‌తో నాలుగు పశువులు మృత్యువాతపడ్డాయి. స్థానికుల వివరాల ప్రకారం... అక్బర్‌కు చెందిన రెండు ఆవులు, వీరేశ్‌కు చెందిన ఆవు, గేదె గ్రామ సమీపంలోని పంట పొలాల్లో మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఈ క్రమంలో విద్యుత్ తీగలు మూడు ఆవులు, గేదెపై పడడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

సిర్పూర్(టి): మండలంలోని రెండు అంతర్రాష్ట్ర రహదారుల్లో పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని సిర్పూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా చౌరస్తా వద్ద, మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలో వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

నిప్పుతో జాగ్రత్త..!

- చిన్నచిన్న తప్పిదాలతోనే అగ్ని ప్రమాదాలు
- అప్రమత్తతతోనే నివారణ
- ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

మంచిర్యాలక్రైం: చిన్నచిన్న తప్పిదాలతోనే నిత్యం ఏదో ఓ చోట అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నాయి. ప్రమాద స్థలాలకు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని నష్టాన్ని నివారించే అవకాశం చాలా తక్కువే. అందుకే అసలు అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలు. ఈ నెల 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

నాసిరకం విద్యుత్ తీగలు..

పట్టణాల్లో జరిగే 30శాతం అగ్ని ప్రమాదాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే. దీనికి కారణం నాసిరకం విద్యుత్ తీగలు వాడడమే. తక్కువ ధరకు కొనుగోలు చేసిన నాసిరకం తీగలతో ఓవర్ లోడ్ విద్యుత్ సరఫరా జరిగినప్పుడు షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతోంది. తీగలు తెగినప్పుడు కొందరు మధ్యలో అతుకులు వేస్తుంటారు. ఇలా చేయడంతో విద్యుత్ జాయింట్ వేసిన ప్రాంతంలో ఓవర్ లోడ్ విద్యుత్ సరఫరా అయినప్పుడు వేడికి కరిగిపోయి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపిస్తాయి. తరుచుగా విద్యుత్ తీగలు మార్చుకోవడంతో ప్రమాదాలు నివారించవచ్చు.

అందుబాటులో అగ్నిమాపక పరికరాలు..

అగ్ని ప్రమాదాలు నిరోధించేందుకు అనేక పరికరాలు అందుబాటులో ఉంచాలి. పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్యపరమైన స్థలాలు, హోటళ్లు, బార్లు, సినిమా థియేటర్లు, కళ్యాణ మండపాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, లాడ్జీలు తదితర ప్రదేశాల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. తక్కువ ధరలోనే లభించే ఈ పరికరాలు ఇళ్లలో సైతం ఏర్పాటు చేసుకుంటే మంచిది.

వంటగదిలో జాగ్రత్తలు....

సాధారణంగా ఇళ్లలో వంటగ్యాస్ లీకేజీతోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఐఎస్ఐ మార్క్ లేని నాసి రకం పైపు, నిర్దేశిత రెగ్యులేటర్ వాడకపోవడం కారణం. ముఖ్యంగా వంటగదికి కిటికీలు, వెంటిలేటర్లు ఉండాలి. గ్యాస్ లీకేజీ ఏర్పడినా బయటకు వెళ్లిపోతుంది. అలాగే గడ్డికుప్పలు, పత్తి, పత్తి కర్ర కుప్పలకు త్వరగా మంటలు వ్యాపిస్తాయి. జాగ్రత్తలు తీసుకుంటే మేలు.



మాతాశిశు కేంద్రంలోని వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జిల్లాలో మూడేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు...

సంవత్సరం	అగ్ని ప్రమాదాలు	ఆస్తినష్టం రూ.లలో
2020–2021	184	రూ.2కోట్లు
2021–2022	124	రూ.88లక్షలు
2022– డిసెంబర్	152	రూ.కోటి 10లక్షలు

జిల్లాలోని ఫైర్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు....

అగ్నిమాపక కేంద్రం	అధికారి సెల్ నం.	ఫైర్‌స్టేషన్ ల్యాండ్/మొబైల్ నంబర్
మంచిర్యాల	8712699195	08736 252101/87126 99194
బెల్లంపల్లి	8712699199	08735 225101/87126 99198
జన్నారం	8712699197	08739 245101/87126 99196
చెన్నూర్	8712699201	08737 242101/8712699200

నివారణకు వినియోగించాల్సినవి...

- సోడా, యాసిడ్, నీటి కార్బన్‌డయాక్సైడ్ మిశ్రమాన్ని విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలకు తప్ప మరే అగ్ని ప్రమాదాలకైనా వాడొచ్చు. ఇందుకు సంబంధించిన రసాయన మిశ్రమాలు నింపిన పరికరాలు అందుబాటులో ఉంచాలి.
- పెట్రోల్, డీజిల్, ఆయిల్, గ్రీజ్ తదితర చమురు పదార్థాలు కాలుతున్నప్పుడు నీటిని పోయకూడదు. నీరు ఎక్కువగా బరువు ఉంటుంది. అందుకే నీరు మంటల కిందికి వెళ్తుంది. కానీ మంటలను ఆర్పివేయదు. అల్యూమీనియం సల్ఫేట్, సోడియం బైకార్బోనైట్ మిశ్రమం గల నురుగు గల పరికరాన్ని ఉపయోగించాలి.
- విద్యుత్‌తో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు గ్యాస్‌లాగా ఉండే కార్బన్ డయాక్సైడ్ గ్యాస్ పరికరాన్ని వాడాలి.

నిర్లక్ష్యంతోనే అగ్ని ప్రమాదాలు



చిన్నపాటి నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ శుక్రవారం ఏదైన ఓ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చు.- **అజయ్‌బాబు, జిల్లా ఫైర్ అధికారి, మంచిర్యాల**

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



జాడి తిరుపతి(ఫైల్)

దస్తురాబాద్: ప్రేమించిన అమ్మాయి కాదనడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని బుట్టపూర్ గ్రామానికి చెందిన జాడి తిరుపతి(20) ప్రేమించిన అమ్మాయి కాదనడంతో మనస్తాపానికి గురై ఈ నెల 15న రాత్రి ఇంట్లోని గడ్డిమందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. తండ్రి జాడి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



చరణ్‌కుమార్ మృతదేహం

నిర్మల్‌టౌన్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని బోయివాడకు చెందిన జేష్టం చరణ్‌కుమార్ (28) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన చరణ్ మంగళవారం ఉదయం అదే కాలనీ సమీపంలోని పెట్రోల్ పంపు ఎదుట మృతిచెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ మల్లేష్ చేరుకుని పరిశీలించారు. మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మొక్కజొన్న దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు నాగరాజు రవి, నాగరాజు రాజు రబీ సాగులో మూడు ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశారు. కోత దశలోని సమయంలో పొలంలోని ఎల్టీ విద్యుత్ లైన్ తీగలు గాలికి స్పార్క్ కావడంతో నిప్పురవ్వలు మొక్కజొన్న పంటలో పడడంతో పంట మొత్తం దగ్ధమైంది. రూ.3లక్షల వరకు నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లంపానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

సిరికొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. చిమ్మన్‌గూడి గ్రామంలో 100 లీటర్ల బెల్లం పానకం, చిమ్మన్‌గూడి గ్రామ చౌరస్తాలో మూడు లీటర్ల గుడుంబా, బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ సీఐ రాజమౌళి తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ కుమార్, ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేష్, దేవందర్, వి.సంధ్య, మహ్మద్, కె.మంజుల ఉన్నారు.

ఉన్నత విద్యకు వసతులు మెరుగు

ఉట్నూర్: ఉన్నత విద్యను అభ్యసించే గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యూనివర్సిటీల్లో ఉంటూ ఉన్నత విద్య అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాల ఏర్పాటు కోసం గిరిజన సంక్షేమ శాఖ చర్యలు తీసుకోనుంది. ఆయా యూనివర్సిటీల్లో బాల బాలికలకు ప్రత్యేకంగా వసతి గృహాల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

ఉమ్మడి జిల్లాలో....

ఉమ్మడి జిల్లా ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న గిరిజన విద్యార్థులు పదో తరగతి ఆపై డిగ్రీ పూర్తి కాగానే ఉన్నత విద్య కోసం యూనివర్సిటీల బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4.95 లక్షల గిరిజనులుండగా గిరిజన విద్యాభివృద్ధి కోసం గిరిజన సంక్షేమ శాఖ అధీనంలో 133 ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకులాలు ఆధ్వర్యంలో 28 వరకు గురుకులాలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలున్నాయి. వీటి పరిధిలో ప్రతి విద్యా సంవత్సరంలో 47 వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే డిగ్రీ వరకు విద్య పూర్తి కాగానే విద్యార్థులు పై చదువుల కోసం యూనివర్సిటీల బాట పట్టాల్సి వస్తోంది. అయితే ఆయా యూనివర్సిటీలలో గిరిజన విద్యార్థులకు పరిమిత సంఖ్యలో సీట్లు ఉండడంతో పాటు రిజర్వేషన్ల ప్రకారం గిరిజన విద్యార్థులకు తక్కువ సంఖ్యలో సీట్లు ఉండడంతో గిరిజన విద్యార్థులకు నష్టం జరుగుతోంది. దీంతో అధిక శాతం గిరిజన విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఉన్నత విద్యను మధ్యలోనే నిలిపివేస్తున్నారు.

ప్రత్యేక వసతి గృహాల ఏర్పాటు...

రాష్ట్రంలో పది యూనివర్సిటీలు, మూడు సెంట్రల్ యునివర్సిటీలు, ఒకటి టెక్నాలిజికల్ యూనివర్సిటీ ఉంది. ఉమ్మడి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య కోసం యూనివర్సిటీలకు వెళ్తున్నారు. వీరికి మెరుగైన ఉన్నత విద్య అవకాశాలు కల్పించడంతో పాటు ఉచిత వసతి సౌకర్యాల కోసం ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు యూనివర్సిటీల్లో బాల బాలికలకు వేర్వేరుగా ఒక్కో యూనివర్సిటీల్లో రెండు వసతి గృహాల నిర్మాణం చొప్పున 14 వసతి గృహ భవనాలు నిర్మిస్తోంది. ప్రతి వసతి గృహ నిర్మాణానికి రూ.5కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.



నోరూరిస్తున్న తాటి ముంజలు

వేసవిలో మనకు చల్లదనం ఇచ్చేందుకు ప్రకృతి ప్రసాదించిన వాటిలో తాటి ముంజలు ప్రత్యేకమైనవి. వీటిని వయసుతో సంబంధం లేకుండా అందరూ అమితంగా ఇష్టపడతారు. ఇవి స్వచ్ఛమైనవి. మండుటెండల నుంచి ఉపశమనం కల్పిస్తాయి. శరీరాన్ని చల్లబరుస్తాయి. ఆరోగ్య ప్రదమైన తాటి ముంజలను చుట్టు పక్కల గ్రామాల నుంచి తీసుకువచ్చి పట్టణాల్లోనూ విక్రయిస్తున్నారు. నిర్మల్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నోరూరిస్తున్న తాటి ముంజలను జనం ఎగబడి కొంటున్నారు. రూ.100కు డజన్ ముంజలు విక్రయిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ రహదారిపై పిప్రికాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బాబుల్‌గాంకు చెందిన గంగాధర్ బైక్‌పై భైంసా నుంచి వెళ్తుండగా కూడలి వద్ద మహీంద్ర సుప్రో వాహనం ఢీకొని కిందపడ్డాడు. దీంతో గంగాధర్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో ఏరియాస్పత్రికి తరలించారు.

వడదెబ్బతో యువతి మృతి



పరమేశ్వరి మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన పరమేశ్వరి(17) మంగళవారం వడదెబ్బతో చనిపోయింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంతోష్, లలిత దంపతుల కూతురు పరమేశ్వరి సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లి వచ్చి కళ్లు తిరుగుతున్నాయని పడిపోయింది. ప్రాణాలు కోల్పోయింది. తీవ్రమైన ఎండలో వెళ్లడం వల్లే వడదెబ్బ తగిలి చనిపోయిందని కుటుంబ సభ్యులుత ఎలిపారు. సర్పంచ్ సరితాశ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఫోన్‌పోతే బాధ అవసరం లేదు

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోయిందని బాధ పడనక్కర్లేదని, ఫోన్ పోతే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఈ వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమన్నారు. దొంగతనం లేదా పోయిన మొబైల్‌ని తిరిగి పొందడానికి సీఈఐఆర్ అనే వెబ్‌సైట్ ఉపయోగాన్ని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి అన్నీ పోలీస్‌స్టేషన్లలోని అధికారులకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మార్కెట్‌లో చౌకగా వస్తుందని, సెకండ్ హ్యాండ్ ఫోన్‌లు కొనే ముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసుకోవాలన్నారు. దొంగతననికి లేదా ఫోన్‌లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని తెలిపారు. సుమారుగా 250 మొబైల్ ఫోన్స్ బాధితులకు పట్టించినట్లు వివరించారు. కొత్తగా ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సీఈఐఆర్) అప్లికేషన్ ఫోన్ వెతికి పెట్టడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ అప్లికేషన్‌పై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దీనిపై సందేహాలు ఉంటే రవికుమార్, నిర్మల్ జిల్లా సైబర్ ల్యాబ్ ఇన్‌చార్జ్ నెంబర్ 8712659567 కి సంప్రదించవచ్చని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే పోడుహక్కుల చట్టం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్
- ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం



కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నాయకులు

ఖానాపూర్: గిరిజనుల కోసం పోడుహక్కుల చట్టం తెచ్చి లక్షలాది మందికి అటవి హక్కు పత్రాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్లో పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్ అధ్యక్షతన జరిగిన పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పోడుహక్కుల చట్టం తెచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్కరికీ హక్కు పత్రాలు ఇవ్వలేని దుస్థితిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. ప్రజారాజ్యం పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఏలేటికి అదిష్టానం జాతీయ స్థాయిలో పదవి కట్టబెట్టి రాజులా గుర్తించిందన్నారు. బీజేపీలో నేడు బానిసలా ఉండే దుస్థితి రాబోతుందన్నారు. కేసీఆర్ పాలనలో లిక్కర్ స్కాంలు, లీకేజీలు తప్ప ప్రజలకు చేసిందేమిలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్‌తో ఎటువంటి పొత్తులు ఉండబోవని రాహుల్‌గాంధే స్పష్టం చేశారన్నారు. నిరుద్యోగ సమస్యపై సరూర్‌నగర్‌లో మేలో జరిగే భారీ సభకు ప్రియాంకగాంధీ హాజరవుతారన్నారు. ఎంతమంది నాయకులు కాంగ్రెస్‌ను వీడినా కార్యకర్తలంతా పార్టీ వెంటే నడుస్తారని తెలిపారు. అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు మాట్లాడుతూ పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపించుకుంటామన్నారు. కార్యక్రమంలో బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఎర్రవత్రి అనిల్, జెడ్పీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సత్తు మల్లేశ్, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆనంద్‌రావు, ఎంబడి రాజేశ్వర్, దుర్గ భవాని, చిన్నం సత్యం, యూసుఫ్‌ఖాన్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, తోట సత్యం, కడార్ల గంగనర్సయ్య, జహీర్ హైమద్, అబ్బుబై, తిరుపతిగౌడ్, రాజునాయక్ ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

నర్సాపూర్(జి): మండలంలోని డొంగుర్గాం సుద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఎటువంటి అనుమతి పత్రాలు (రశీదులు)లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు తహసీల్దార్ శ్రీకాంత్ జరిమానా విధించారు. ట్రాక్టర్‌కు రూ.800 చెల్లించి రశీదు తీసుకొని ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల లోపే ఇసుక రవాణా జరిగేలా చూడాలని ఇటీవల కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కానీ అందుకు పరిస్థితి భిన్నంగా ఉండడం అనుమానాలకు తావిస్తోంది. ఇసుకాసురులు ధనార్జనే ధ్యేయంగా రాత్రి వేళల్లో సైతం సుద్దవాగు నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

శివాలయంలో చోరీ



హుండీని పగులకొట్టే ప్రయత్నం చేస్తున్న దుండగులు (సీసీ కెమెరాలోని దృశ్యం)

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లోని శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని రెండు హుండీలను పగులకొట్టిన దుండగులు అందులోని నగదును ఎత్తుకెళ్లారు. 15 రోజుల క్రితం హుండీని లెక్కించారు. అప్పటి నుంచి హుండీకి తాళం వేసి ఉంది. మంగళవారం ఉదయం ఆలయ పూజారి ఉదయం వచ్చి చూడగా హుండీని పగులకొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. చోరీకి పాల్పడిన దృశ్యాలు కెమెరాలో నిక్షిప్తమయ్యాయని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీలోని జోన్ 2లో నివాసముంటున్న జిల్లా దళితాభివృద్ధి అధికారి సునీతా కుమారి ఇంట్లో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు తాళాలను పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఈ మేరకు మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బతుకుచిత్రం



మురికి కాలువ పక్కన కూర్చుని తింటున్న చిన్నారులు

ఇచ్చోడ: దేశంలో ఓ వైపు సంపన్నులు పెరుగుతున్నప్పటికీ మరో వైపు నిరుపేదలు మరింత నిరుపేదలుగా మారుతూనే ఉన్నారు. ఒకపూట కడుపు నింపుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఆడుతూ పాడుతూ గడపాల్సిన చిన్నారులు చేతిలో గిన్నె పంటుకుని అన్నం కోసం ఇంటింటికీ తిరుగుతున్నారు. ఓ తల్లి పెట్టిన పట్టెడు మెతుకులను ఓ మురుగు కాల్వ పక్కన కూర్చుని తింటున్న గుండెలు కదిలించే దృశ్యం మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో సాక్షికి చిక్కింది.

బీటీ మోక్షమెప్పుడో?

- ఫకీర్‌పేట్‌–పుల్‌గాం్రపాండి మార్గంలో 4 కి.మీ మట్టి రోడ్డు
- దారి మధ్యన టైగర్‌ రిజర్వ్‌ ఫారెస్ట్‌
- అనుమతి లభించక చేపట్టని నిర్మాణం
- పనులు పూర్తయితే తగ్గనున్న దూరభారం


రోడ్డు నిర్మాణం కావల్సిన అటవీ ప్రాంతం

ఇచ్చోడ: రహదారులకు మోక్షం కలగడం లేదు. ఎన్నోఏళ్లుగా రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న అక్కడి గ్రామాల ప్రజలకు దారి కష్టాలు తప్పడం లేదు. ఆదిలాబాద్‌ జిల్లా సిరికొండ మండలం ఫకీర్‌పేట్‌ నుంచి నిర్మల్‌ జిల్లా పెంబి మండలంలోని పుల్‌గాం్రపాండి వరకు బీటీ రోడ్డు ఉంది. ఈ మార్గంలో సుమారు 4 కి.మీ మట్టి రోడ్డే దిక్కయింది. టైగర్‌జోన్‌ రిజర్వ్‌ ఫారెస్ట్‌ ఉండడంతో బీటీ నిర్మాణానికి అనుమతులు లభించక పనులు చేపట్టని పరిస్థితి. ఈ దారిగుండా బైక్‌లు, ఆటోలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఫారెస్ట్‌ అనుమతి లభించి నాలుగు కి.మీ బీటీ నిర్మిస్తే ఆదిలాబాద్‌, నిర్మల్‌, జగిత్యాల జిల్లాల ప్రజల రాకపోకలకు దూరభారం తగ్గనుంది. సుమారు 80 కి.మీ దూరభారంతోపాటు సమయం తగ్గుతుంది.

ఎదురుచూపు..

ఈ రహదారి నిర్మాణం కోసం అటు పెంబి మండల ప్రజలు ఇటు ఇచ్చోడ, సిరికొండ మండలాల ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రం ఏర్పాటుతో రోడ్డుకు మోక్షం లభిస్తోందని అనుకున్నారు. సీఎం కేసీఆర్‌ సైతం ఇచ్చోడ సభలో పెంబి, రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. కానీ రోడ్డు నిర్మాణానికి అడుగు ముందుకు పడటం లేదు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఫకీర్‌పేట్‌ నుంచి పుల్‌గాం్రపాండి వరకు బీటీ రోడ్డు ఉంది. 4 కి.మీ మేర టైగర్‌ రిజర్వ్‌ ఫారెస్ట్‌ ఉండడంతో అనుమతి లభించలేదు. బీటీ పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. మారుమూల గ్రామాల ప్రజలకు రోడ్డు కష్టాలు తీర్చాలి. – తుల్సిరాం, నారాయణ్‌పూర్‌

గిరిజన గ్రామాలపై చిన్నచూపు



ప్రభుత్వం గిరిజన గ్రామాలపై చిన్నచూపు చూస్తోంది. గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించడం లేదు. ఇప్పటికైన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి. – అమృత్‌రావు, కుంటగూడ

ఐకేపీ వీవోఏల నిరవధిక సమ్మె


భీంపూర్‌లో పాల్గొన్న వీవోఏలు

తాంసి/ఇంద్రవెల్లి: ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అందించాలని తదితర డిమాండ్‌తో భీంపూర్‌, ఇంద్రవెల్లి మండలాల ఐకేపీ కార్యాలయాల ఎదుట మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం భీంపూర్‌ మండల అధ్యక్షుడు అరుణ్‌ మాట్లాడారు. వీవోఏలకు చాలిచాలనీ వేతనం సరిపోక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణకు కష్టంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలకు సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు అందించాలని డిమాండ్‌ చేశారు. తమకు న్యాయం చేసేవరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పుర్క దాంజీ, వీవోఏలు విజయ, లక్ష్మి, కవిత, ప్రమోద్‌ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

నార్నూర్‌: ప్రభుత్వం వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ ఏపీఎం రమేశ్‌, తహసీల్దార్‌ ఆర్కా మోతిరాం, ఎస్సై రవికిరణ్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం ఐకేపీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం అధ్యక్షుడు గోవింద్‌, కార్యదర్శి రాథోడ్‌ శారద మాట్లాడారు. ఈనెల 4 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌ పనులు బంద్‌, 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. సంఘం నాయకులు పవార్‌ విజయ్‌పాల్‌, తాతేరావు, ధోండుబాయి, మౌనిక, జయసుధ, జనాబాయి తోపాటు మొత్తం 38 మంది వీవోఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న క్షమాదేశ్‌పాండే

బేల: ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే పేర్కొన్నారు. మండలంలోని అవాల్‌పూర్‌ గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం సాయంత్రం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న గొడవలకు కోర్టుల చుట్టూ తిరగవద్దని, రాజీ కుదుర్చుకోవడంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఉచిత న్యాయ సలహాలు, సూచనలు, సేవల కోసం జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలన్నారు. ఏఎస్సై జీవన్‌, సర్పంచ్‌ మినక పుష్పలత, ఎంపీటీసీ నగేశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


సభ్యులను సన్మానిస్తున్న జిల్లా సభ్యులు

తాంసి: తాంసి, భీంపూర్‌ మండలాల బీసీ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాంసి, భీంపూర్‌ అధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్‌, సంతోష్‌, ఉపాధ్యక్షులుగా మహేందర్‌, వెంకటేశ్‌ యాదవ్‌ ఎన్నికయ్యారు. వీరిని జిల్లా సంఘం సభ్యులు సన్మానించారు. ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్‌, గౌరవ అధ్యక్షుడు నర్సాగౌడ్‌, జిల్లా నాయకులు అశోక్‌, శ్రీనివాస్‌, సర్పంచ్‌ కృష్ణ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న శివాజీ, తదితరులు

ఆదిలాబాద్‌టౌన్‌: అగ్ని ప్రమాదాలకు అస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్‌ ఫైర్‌స్టేషన్‌ అధికారి శివాజీ సూచించారు. అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డు, ఎల్‌పీజీ గోడౌన్‌లు, పెట్రోల్‌ పంపుల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన చర్యలపై వారికి వివరించారు. అనంతరం ప్రమాదాలను నియంత్రించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను తెలిపే ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అర్బన్‌ పార్కులో మంటలు


మంటలార్పుతున్న సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని బోథ్‌ ఎక్స్‌రోడ్డు వద్ద గల అర్బన్‌ పార్కులోని గడ్డికి మంగళవారం మంటలు అంటుకున్నాయి. దీంతో అటవీ అధికారులు ట్యాంకర్‌ ద్వారా మంటలార్పివేశారు. మొక్కలకు ఎలాంటి నష్టం జరగలేదని బోథ్‌ ఎఫ్‌ఆర్వో ప్రణయ్‌ తెలిపారు. పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో పలువురు పత్తి కుప్పలకు కాలబట్టారు. అర్బన్‌ పార్కులో గడ్డికి నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన అధికారులు మంటలార్పివేశారు.

పశుగ్రాసం దగ్ధం

బోథ్‌: మండలంలోని కనుగుట్ట గ్రామంలో రైతు గంగయ్యకు చెందిన చేనులో పశుగ్రాసం ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమైంది. ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించి చుట్టూ దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. భయాందోళనలకు గురైన స్థానికులు వెంటనే మంటలార్పివేశారు.

ఈఎస్‌ఐ నగదు ఇవ్వకుంటే సమ్మెకు దిగుతాం

కైలాస్‌నగర్‌: ఆదిలాబాద్‌ మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన ఈఎస్‌ఐ నగదును కట్‌ చేస్తున్నా వారి ఖాతాల్లో జమ చేయడం లేదని కార్మికులు ఆరోపించారు. ఈఎస్‌ఐ నగదు చెల్లించాలంటూ పలువురు మంగళవారం మున్సిపల్‌ కమిషనర్‌ శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. గతఏడు నెలలుగా తమ జీతాల్లోంచి ఈఎస్‌ఐ నగదు కట్‌ అవుతున్నా ఖాతాల్లో జమ చేయడం లేదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లో ఈఎస్‌ఐ నగదును కార్మికుల ఖాతాలో జమచేయని పక్షంలో కార్మికులతో కలిసి మెరుపు సమ్మెకు దిగనున్నట్లు స్పష్టం చేశారు.

అభివృద్ధి పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి

- ఖానాపూర్‌ ఎమ్మెల్యే రేఖానాయక్‌


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్‌

సిరికొండ: రాష్ట్రంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీని గెలిపిస్తాయని ఖానాపూర్‌ ఎమ్మెల్యే రేఖానాయక్‌ పేర్కొన్నారు. మండలంలోని కొండపూర్‌ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారని అందులో భాగంగా వివిధ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. మండలంలో గత వర్షాకాలంలో వరద వల్ల కొండాపూర్‌ బ్రిడ్జి అప్రోచ్‌ రోడ్డు కొట్టుకుపోతే నెల రోజుల్లో రోడ్డు నిర్మించామని గుర్తు చేశారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలందిస్తున్న బీఆర్‌ఎస్‌కు తమ మద్దతు తెలపాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది అనేక పార్టీల నాయకులు ఉచిత హామీలంటూ మోసం చేసేందుకు కుట్ర చేస్తారని ప్రజలు గమనించాలన్నారు. కాగా, ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ గైర్హాజరయ్యారు. పార్టీ నాయకులు షేక్‌ బషీర్‌, లోకండే సునీల్‌, గుండాల రాజారాం, విజయ్‌, గోవర్ధన్‌ నాయక్‌, ఇంద్రవెల్లి నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

డబుల్‌ బెడ్రూంలు, రుణమాఫీ ఏమైంది?


సమస్యలు తెలుసుకుంటున్న సుహాసినిరెడ్డి

బేల: ప్రభుత్వం ఎన్నికల హామీలో నిరుపేదలకు అందిస్తామన్న డబుల్‌ బెడ్రూంలు, రైతులకు రూ.లక్ష రుణమాఫీ ఏమైందని బీజేపీ జిల్లా నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ప్రశ్నించారు. మండలంలోని కొబ్బాయి గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని ఆరోపించారు. ఆదిలాబాద్‌లో అభివృద్ధి ప్రకటనలకే పరిమితమైందని తెలిపారు. కొబ్బాయి గ్రామంలో కనీస వసతులు లేవని, స్థానికంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఇప్పటిదాకా ప్రారంభించలేదని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్‌, నాయకులు గటిక క్రాంతికుమార్‌, గన్నోజి విజయ్‌, ఠాక్రే సందీప్‌, శివకిరణ్‌ తదితరులు ఉన్నారు.

ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ధర్మరాణి

నేరడిగొండ: ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని డీఎల్‌పీవో ధర్మరాణి అన్నారు. మండలంలోని తర్నం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇంటి నంబర్‌ విషయమై ప్రజావాణిలో ఇటీవల ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో శోభన, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, సర్పంచ్‌ విశాల్‌, బీఆర్‌ఎస్‌ కన్వీనర్‌ అల్లూరి శివారెడ్డి, అడెల్లు తదితరులు ఉన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాథోడ్‌ బాపూరావ్‌

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన నాందేవ్‌, శ్రీకాంత్‌ మృతిచెందారు. విషయం తెలుసుకున్న బోథ్‌ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపూరావ్‌ మంగళవారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్‌ అడవ్‌ మారుతి, నాయకులు రాథోడ్‌ ప్రవీణ్‌ తదితరులు ఉన్నారు.

అటెన్షన్‌ ప్లీజ్‌ — విద్యుత్‌ తీగలు సరిచేయండి



సిరికొండ: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌ ముందు వ్యవసాయ చేనులోకి వెళ్లే త్రీఫేజ్‌ విద్యుత్‌ తీగలు కిందికి వేలాడుతున్నాయి. చెట్ల కొమ్మలకు తగులుతూ గాలి వచ్చినప్పుడు ఒకదానికి ఒకటి తగిలి విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైన అధికారులు తీగలను సరిచేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– అధికారి: రోహిదాస్‌, మండల ఇన్‌చార్జి ఏఈ, సెల్‌: 94408 11702

ఆటాపాటలతో విద్య

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ఆటాపాటలతో బోధన చేస్తున్నామని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ మంజుల అన్నారు. మంగళవారం మండలంలోని యేసుగూడ, మాధపూర్‌, వాగ్దారి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో పిల్లల తల్లిదండ్రులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ ఇంటింటా ప్రచారం

ఎదులాపురం: ప్రజా సమస్యలను విస్మరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలనే లక్ష్యంతో భీంసరిలో బుధవారం సీపీఐ ఇంటింటా ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ కో హటావో దేశ్‌కో బచావో నినాదంతో పార్టీ పిలుపుతో దీన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయానికి ఉదయం 7: 40 గంటలకు చేరుకోవాలని కోరారు.

అన్నిరంగాల్లో పట్టణాభివృద్ధి

- మున్సిపల్‌ ఛైర్మన్‌ జోగు ప్రేమేందర్‌


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రేమేందర్‌

కైలాస్‌నగర్‌: మంత్రి కేటీఆర్‌, ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవతో ఆదిలాబాద్‌ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌ అన్నారు. స్థానిక 32వ వార్డు పరిధిలోని అబ్దుల్లాచౌక్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ సుందరీకరణతోపాటు ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ జహీర్‌ రంజాని, నాయకులు శ్రీను తదితరులు ఉన్నారు.

పేద మైనార్టీలకు ప్రభుత్వ రంజాన్‌ కానుక

రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ముస్లింలకు అందిస్తున్న కానుకలను బంగారుగూడ కాలనీలో మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌ మంగళవారం పంపిణీ చేశారు. వైస్‌ చైర్మన్‌ జహీర్‌ రంజానీతో కలిసి వాటిని అందజేశారు. టీజాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్‌రావు నాయకులు ఇక్రాల్‌, ఇస్మాయిల్‌ ఉన్నారు.

అంబేద్కర్‌ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్‌టౌన్‌: రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికి హక్కులు కల్పించిన మహనీయుడు డా.బాబా సాహెబ్‌ అంబేద్కర్‌ అని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో పయనించాలని మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌ అన్నారు. మున్సిపల్‌ ఆధ్వర్యంలో రూ.9 లక్షల వ్యయంతో రిమ్స్‌ ఆసుపత్రి ఎదుట ప్రతిష్ఠించనున్న అంబేద్కర్‌ విగ్రహానికి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌, దళిత సంఘాల నాయకులతో కలిసి గౌతమబుద్ధుడు, అంబేద్కర్‌ చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 2.20కోట్లతో చేపట్టిన అంబేద్కర్‌ భవన పనులు తుది దశకు చేరాయని దాన్ని త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ జహీర్‌ రంజానీ, దళిత సంఘాల నాయకులు దుర్గం శేఖర్‌, బాబా సాహెబ్‌ కాంబ్లే, శైలేందర్‌ వాఘ్మరే, శోభతాయి తుల్జాపూరే పాల్గొన్నారు.

ఈద్గా ఏర్పాట్ల పరిశీలన

ఆదిలాబాద్‌: రంజాన్‌ సందర్భంగా ప్రార్థనల కోసం ఈద్గాకు వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌ అన్నారు. షాబ్‌–ఏ–ఖదర్‌ను పురస్కరించుకొని మంగళవారం ఈద్గా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మున్సిపల్‌ కమిషనర్‌ శైలజ, వైస్‌ చైర్మన్‌ జహీర్‌ రంజాని, కౌన్సిలర్‌ వెనుగంటి ప్రకాశ్‌, కోఆప్షన్‌ సభ్యులు ఎజాజ్‌ తదితరులు ఉన్నారు.

సేమియా పంపిణీ


సేమియా, సరుకులు అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్‌: రంజాన్‌ మాసం పురస్కరించుకుని పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌, సుభాష్‌నగర్‌, తాటిగూడ, మహాలక్ష్మివాడలోని పేద ముస్లిం కుటుంబాలకు కాంగ్రెస్‌ నాయకులు మంగళవానం సేమియా పంపిణీ చేశారు. పార్టీ నాయకుడు అల్లూరి సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా రంజాన్‌ మాసంలో మాజీమంత్రి రాంచంద్రారెడ్డి సొంత ఖర్చుతో పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు సేమియా, ఇతర సరుకులు అందజేస్తున్నారని అన్నారు. నాయకులు దిగంబర్‌రావు పాటిల్‌, అంబకంటి అశోక్‌, వసీంఉద్దీన్‌, సైద్‌ఖాన్‌, ప్రవీణ్‌, ఎస్‌.కె నాహీద్‌, అఫ్సర్‌, జహీర్‌, బషీర్‌, కాంగ్రెస్‌ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం


మట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

బోథ్‌: త్వరలో బీఆర్‌ఎస్‌ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌ కుమార్‌ తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయ ఆవరణలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 2001లో ఉద్యమ పార్టీగా అవతరించి, నేడు రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. 2500 మందితో నియోజకవర్గంలో త్వరలో సభ ఏర్పాటు చేస్తామన్నారు. మండల కన్వీనర్‌ నారాయణరెడ్డి, సర్పంచ్‌ సురేందర్‌ యాదవ్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రుక్మణ్‌ సింగ్‌, వైస్‌ ఎంపీపీ లింబాజీ, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు తాహెర్‌ బిన్‌ సలాం, మండల ప్రధాన కార్యదర్శి ఎల్కరాజు, గ్రంథాలయ డైరెక్టర్‌ రమణగౌడ్‌, రఫీ, మాజీ ఎంపీటీసీ రాథోడ్‌ రాయల్‌, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా రాజు

నేరడిగొండ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్‌ రాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల శుక్రవారం 'సాక్షి'లో 'పీహెచ్‌సీలో ఇష్టారాజ్యం', సోమవారం 'పీహెచ్‌సీలో నీటి కటకట' శీర్షిక కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. దీంతో రిమ్స్‌ నుంచి వైద్యులను ఇక్కడి పీహెచ్‌సీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. పీహెచ్‌సీలో ఉన్న వైద్యాధికారితో పాటు రాజు విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆయన్ను సన్మానించి స్వీట్లు తినిపించారు. మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని రాజు తెలిపారు.

ఎడ్‌సెట్‌ దరఖాస్తు గడువు ఈనెల 20

ఆదిలాబాద్‌టౌన్‌: ఎడ్‌సెట్‌ (బీఎడ్‌) కోసం ఈనెల 20 వరకు దరఖాస్తులకు గడువు ఉందని విద్యార్థి బీఎడ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశపరీక్ష మే 18న ఉంటుందని వివరించారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.

సన్మానం

ఆదిలాబాద్‌అర్బన్‌: ఈనెల 13, 14వ తేదీల్లో డాక్టర్‌ అంబేద్కర్‌ విగ్రహావిష్కరణ, జయంతి వేడుకలు పట్టణంలో నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం కావడం పట్ల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం శేఖర్‌ను పట్టణంలో మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌ మంగళవారం సన్మానించారు. నాయకులు ప్రశాంత్‌, మహేందర్‌, మోహన్‌, గణేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎస్సై లాల్‌సింగ్‌ నాయక్‌

తాంసి: మండల కేంద్రంలోని బస్టాండ్‌ వద్ద బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్సై లాల్‌సింగ్‌ నాయక్‌ మంగళవారం ప్రారంభించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసిన సంతోష్‌రెడ్డిని అభినందించారు. బ్యాంక్‌ మేనేజర్‌ సాయి, నాయకులు అనిల్‌, ప్రకాశ్‌, రాకేశ్‌, పోచ్చన్న తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్‌


పాల్గొన్న బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకురాలు జాదవ్‌ సుమన్‌ బాయి, ముస్లిం సోదరులు

ఉట్నూర్‌: రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ సమీపంలో బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకురాలు జాదవ్‌ సుమన్‌బాయి మంగళవారం ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాసం విరమించారు. తర్వాత ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్‌, కోఆప్షన్‌ సభ్యుడు రషీద్‌, టీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్‌ ఉన్నారు.

టేబుల్‌ ఫ్యాన్లు అందజేత

ఎదులాపురం: పట్టణానికి చెందిన ఎస్‌.ప్రతాప్‌ తన కుమారుడు నయన్‌ మోహన్‌ పుట్టినరోజు పురస్కరించుకుని మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక బ్రహ్మణవాడ యుఆర్‌ఎస్‌ పాఠశాలకు మూడు టేబుల్‌ ఫ్యాన్లు అందించారు. వారికి పాఠశాల ప్రత్యేక అధికారి ప్రశాంత్‌ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పదోన్నతిపై మోడల్‌ స్కూల్‌కు వెళ్లిన ఉపాధ్యాయుడు రామకృష్ణను సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. ఉపాధ్యాయులు గణేశ్‌, రవికాంత్‌ రెడ్డి, శకుంతల, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఆదిలాబాద్‌: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్తూరు రాజేశ్వర్‌ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 22న వృద్ధులకు ఆత్మీయ సమ్మేళనం, 23న రక్తదాన శిబిరం, 24న సాంస్కృతిక కార్యక్రమాలు, 25న అమ్మవారి వేషధారణలో చిన్న పిల్లల కార్యక్రమం, 26న అమ్మవారి అలంకరణ, 27న మంగళహారతులు, అలంకరణ, 28న కుంకుమపూజ, సహస్ర దీపారాధన, 29న అమ్మవారి చరిత్ర, 30న హారతి, అభిషేకం, అమ్మవారి జయంతి ఉత్సవాలు, మహా ప్రసాదం, అమ్మవారి ఊరేగింపు ఉంటుందని అన్నారు. సంఘ సభ్యులు హరీశ్‌, ఉల్లాస్‌, నర్సింలు, సంతోష్‌, వినయ్‌ రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.